RNI NO: APTEL/26/A7632

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక : 03 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 4 | వెల రూ. 2 | బుధవారం -09 - సెప్టెంబర్ -2026

Published From :Guntur circulated by YSR Kadapa I Chittoor I Kurnool I East & West Godavari I Anatapuram I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..

- ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలైన వైనం
- దట్టమైన బూడిద కారణంగా 8 విమానాశ్రయాలు మూసివేత, 2300 ఫ్లైట్లు రద్దు
- విమానాశ్రయాల్లో చిక్కుకున్న సుమారు 2.70 లక్షల మంది ప్రయాణికులు
- సునామీ ప్రమాదం లేదన్న అధికారులు, లెవెల్-3 హెచ్చరికలు జారీ

## ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్



- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక



## వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

### రైల్వే మంత్రి కీలక ప్రకటన

- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్విని వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

## నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి



- దసరా మరుసటి రోజే కొత్త పార్టీ ప్రకటిస్తానన్న మాజీ ఎంపీ
- టీడీపీ, వైసీపీ కుటుంబ పార్టీలంటూ విజయసాయిరెడ్డి విమర్శ
- నమ్మకద్రోహి అంటే నిజాలు బయటపెడతానంటూ వైసీపీకి హెచ్చరిక
- బొత్స, సత్యకుమార్ ఆరోపణలను తిప్పికొట్టిన సాయిరెడ్డి

## వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు..

# పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

### ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం

- ★ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ★ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ★ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- ★175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- ★టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, మిగతా 2 లో



## నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా: సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

మహిళల గౌరవంపై విజయ్ తీసుకున్న నిర్ణయాలు సంతోషాన్ని ఇచ్చాయన్న చంద్రశేఖర్

ప్రత్యర్థి పార్టీల చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని వ్యాఖ్య

ప్రతిపక్షాల విమర్శలను విజయ్ తిప్పికొట్టిన తీరు సంతోషాన్ని ఇచ్చిందని వెల్లడి

## ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

### సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు?

- సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం
- ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం



అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ మిగతా 2 లో

## 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

### కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం

- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న మిగతా 2 లో

## తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి

# ఆయనతో రాజీనామా చేయించాలి

### శాసనసభకు, స్పీకర్ స్థానానికి, రాష్ట్ర ప్రజలకు అవమానం

- ఎమ్మెల్సీ తాతా మధుతో కేసీఆర్ రాజీనామా చేయించి, క్షమాపణ చెప్పాలి
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్
- ఎమ్మెల్సీ వ్యాఖ్యలను ఖండించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, భాజపా, మజ్లిస్, సీపీఐ సభ్యులు
- మండలి నుంచి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలు సస్పెన్షన్



హైదరాబాద్: రెండో రోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. (మంగళవారం, సెప్టెంబర్ 8వ తేదీ) సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష బీఆర్ఎస్- ప్రభుత్వ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రధానంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ అంశంపై సభ హోరెత్తిపోయింది. దీనిలో భాగంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలకు సభలో తీర్మానం పెట్టారు. మిగతా 2 లో



## నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్



- దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక


### ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని
# సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

### వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..
# రైల్వే మంత్రి కీలక ప్రకటన

ఢిల్లీ: భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్ట్రెస్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

### 'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..
# కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

# నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

ఢిల్లీ: గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

# ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..



ఢిల్లీ: ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

# వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.



ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

# తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి ఆయనతో రాజీనామా చేయించాలి

మొదటి పేజి తరువాయి

ఇందుకు సభలో ఆమోదం లభించింది.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ మండిపడింది. ఆయన మాటలు సభాపతి స్థానానికే కాక.. మొత్తం అసెంబ్లీకి, నాలుగు కోట్ల మంది ప్రజలకు అవమానకరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణకు చీకటి రోజని వెల్లడించారు. స్పీకర్ మాతృమూర్తిని అవమానించడం బాధాకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టారు. అధికారపక్షానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు భాజపా, ఎంఐఎం, సీపీఐ సభ్యులు సైతం భారాస ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు దుర్భాషలాడారని తెలుసుకొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఈ అంశంపై శాసనసభలో ప్రత్యేకంగా చర్చించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్కలు మాట్లాడుతూ.. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయడంతోపాటు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. భారాస దళిత వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. భాజపా, మజ్లిస్ నేతలు సైతం తాతా మధుతో రాజీనామా చేయించాలని కోరారు.



ఇది క్షమించరాని నేరం: సీఎం

స్వతంత్ర భారతంలో ఒక సభాపతికి ఇలాంటి అవమానం ఎప్పుడూ జరగలేదని, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'ఇలాంటి వ్యాఖ్యలను క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండవు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది. సభలో ముఖ్యమంత్రైనా, శాసనసభ్యుడైనా స్పీకర్‌కు ఒకటే. అలాంటి వ్యక్తి మనసు గాయపడేలా భారాస వ్యవహరించింది. ఈ ఘటన గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరికే సంబంధించినది కాదు. మొత్తం సభ్య సమాజానికే జరిగిన అవమానంగా భావించాలి. స్పీకర్ పదవి ఒక అత్యున్నత స్థానం. సభాపతిని గౌరవించడం మన సంప్రదాయం. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా సభ్య సమాజం తలదించుకునేలా కొంతమంది మాట్లాడారు. నేను జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అన్ని సభలనూ చూశాను. కానీ, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై పథకం ప్రకారమే ఉసిగొల్పారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని, మూడెకరాల చొప్పున ఇస్తానని, దళితబంధు ఇస్తామని నమ్మించి.. దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారు. నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి, ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారు. భారాసది దళిత వ్యతిరేక ఆలోచన, వైఖర్లను అందరం ముక్తకంఠంతో ఖండించాలి. ప్రభుత్వం సంయమనం పాటిస్తుంటే చేతకానితనంగా భావిస్తున్నారు. అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకోం. తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి, ఆయనతో రాజీనామా చేయించాలని సభా నాయకుడిగా నేను డిమాండ్ చేస్తున్నా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చర్చ సమయంలో భాజపా నేతలు 22ఏపై చర్చించాలని పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. చర్చకు ఇంతకంటే ప్రాధాన్యమున్న అంశం ఏముంటుందని ప్రశ్నించారు. భారాస వేసిన అపవాదు, దుర్మార్గాలను భాజపా ఎందుకు కాపాడుతోందని నిలదీశారు. భారాస ఎమ్మెల్సీ తాతా మధును భాజపా సమర్థిస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని సూచించారు.

# నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా
## సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల వేళ విజయ్ తండ్రి, సీనియర్ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన పలు రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన ఆయన... తన కొడుకుని చూసి తాను ఎంతో గర్వపడుతున్నాను అంటూ కుమారుడికి పూర్తి మద్దతుగా సంచలన ప్రకటన చేశారు. గతంలో విజయ్‌తో ఉన్న విభేదాలు, వ్యక్తిగత వివాదాల వల్ల దూరంగా ఉంటున్నారనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన విజయ్ వైఖరిని గట్టిగా సమర్థించారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదలపై సభలో విజయ్ తీసుకున్న స్పష్టమైన నిర్ణయాలు, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టిన తీరు పట్ల ఒక తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని, కొడుకు విజయాన్ని, పట్టుదలను చూసి గర్విస్తున్నానని ఎస్.ఏ. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. తండ్రి నుంచి వచ్చిన ఈ బహిరంగ మద్దతుతో టీవీకే వర్గాలు, విజయ్ అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నిండింది.

# మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

హైదరాబాద్: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

# ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే



ఢిల్లీ: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

# నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి

అమరావతి: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు. తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు. తన కొత్త పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తాను ఉండబోనని, సమర్థులైన వ్యక్తినే ఆ స్థానంలో నిలబెడతామని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆసక్తితో 'రెడ్డి' సామాజిక వర్గం ఆవిర్భావం, రెడ్డి రాజుల పాలనపై 350 పేజీల పుస్తకం రాసినట్లు ఆయన వెల్లడించారు.

# అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం: చంద్రబాబు

అమరావతి: అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం.. ఓటు వేయని వారినీ మార్చుకుందాం అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 2వ రోజు సుస్థిర అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని సూచించారు. 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, నీటి లభ్యత సమస్య కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

# పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

అమరావతి: పార్టీ పదవుల్లో ఉన్నవారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని, పార్టీనే సుప్రీం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఏదైనా పని చెబితే దానికే మొదటి ప్రాధాన్యమివ్వాలని లోకేశ్ తెలిపారు. "క్వాంటమ్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే... అదే సమయంలో పార్టీ అప్పగించిన పని ఉండటంతో అదే నాకు ముఖ్యమని చెప్పి, ఆ కార్యక్రమానికి వెళ్లలేదు" అని ఆయన సొంత అనుభవాన్ని వెల్లడించారు. "పార్టీ ఇచ్చిన పనుల్ని తప్పనిసరిగా చేయాల్సిందే. పార్టీ పదవుల్లో ఉన్నవారు.. పార్టీ కార్యక్రమాలకు రావడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు బీఫారం ఇవ్వకపోతే... ఇక్కడున్నవారెవరూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. "పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలి" అని కోరారు.

# ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ... డిప్యూటీ సీఎం



హైదరాబాద్: స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ భావజాలం, ఆలోచన స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇది స్పీకర్‌కు కాదు సభకు జరిగిన అవమానం అని తెలిపారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించిందన్నారు. యావత్ చట్టసభనే బీఆర్ఎస్ సభ్యులు అవమానించారు. సభాపతిని అంటే సభ మట్నత్తాన్ని అన్నట్లే దళిత వర్గాల్లో పుట్టి ఎదిగి వచ్చిన వ్యక్తి స్పీకర్ గడ్డం ప్రసాద్ అని తెలిపారు. ఫ్యూడల్ విధానం మీద పోరాడిన చరిత్ర ఈ సభకు ఉందన్నారు. ఫ్యూడల్ భావజాలం నుంచి పుట్టిందే బీఆర్ఎస్ అని ప్రస్తుతం ఫాంహౌజ్ కుట్ర నడుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భట్టివిక్రమార్క బలపరిచారు. తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## కడప టీడీపీ నేతలతో మంత్రి సవితమ్మ ఆత్మీయ సమావేశం

పార్టీ బలోపేతం.. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం



విజయవాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 08: కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో విజయవాడలోని జయభేరి క్లబ్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న అనంతరం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కడప జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను ఘన మెజారిటీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, మైదుకూరు శాసనసభ్యుడు సుధాకర్ యాదవ్, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

కడప జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహణ

వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన



కడప, మహి న్యూస్, సెప్టెంబర్ 08: కడప జిల్లాలోని అన్ని కోర్టుల్లో సెప్టెంబర్ 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు సంబంధించిన వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు పరిష్కరించదగిన వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా ప్రింట్, ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప కోరింది.




## పెన్షన్ల నమోదును పరిశీలించిన అధికారులు




గాలివీడు:సెప్టెంబర్08(మహి న్యూస్): నూతన పెన్షన్ రిజిస్ట్రేషన్, అప్‌డేట్ ప్రక్రియను ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు అరవీడు గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తుల నమోదు, అప్‌డేట్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధికారుల వివరాల ప్రకారం ఇప్పటివరకు 141 పెన్షన్లు అప్‌డేట్ అయ్యాయి. నూతన పెన్షన్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుల పరిశీలన, డేటా అప్‌డేట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జ్ఞాననేత్ర అందుల స్వచ్ఛంద సేవా సంస్థకు 88 వేల విరాళం




రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 8: జ్ఞాననేత్ర అందుల స్వచ్ఛంద సేవా సంస్థకు 88 వేల విరాళం అందజేసినట్లు దివ్య తేజ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంద విద్యార్థులకు చేయూతను అందించాలని ఉద్దేశంతో తమ విద్యార్థులు, తమ సిబ్బంది, మేనేజ్మెంట్ అందరం కలిసి 88 వేల రూపాయలు విరాళం అందించినట్లు తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయంలో

## 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్-2027

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 08: అన్నమయ్య జిల్లా వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (లెస్ట్--2027) నిర్వహించనున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎం. గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నవోదయ విద్యాలయాలు పనిచేస్తున్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ సెప్టెంబర్ 30, 2026 అని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

9వ తరగతి ప్రవేశాలకు: https://cbseitms.nic.in/2026/nvsix_9/

11వ తరగతి ప్రవేశాలకు: https://cbseitms.nic.in/2026/nvsxi_11/

లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం. గీత తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రవేశ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాలలు విస్తృతంగా ప్రచారం చేయాలని నవోదయ విద్యాలయ సమితి కోరినట్లు ఆమె తెలిపారు.

# అక్షరాస్యతతోనే హక్కులపై అవగాహన

### విద్యతో ఆత్మవిశ్వాసం.. న్యాయ అవగాహనతో సమాజాభివృద్ధి కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు







కడప జిల్లా/మహి న్యూస్ । సెప్టెంబర్ 08: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల




మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, మీడియేటర్ న్యాయవాదుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అక్షరాస్యత ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. విద్య ద్వారా



ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వయోజనులు కూడా విద్యను అభ్యసించేలా వయోజన అక్షరాస్యత కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అక్షరాస్యతతో పాటు ప్రజలకు ప్రాథమిక న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఇతర న్యాయ సేవలపై అవగాహన కల్పించడం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం మరింత చేరువ చేయవచ్చని వివరించారు. ప్రజలు తమకు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సహాయం కోసం న్యాయ సేవల హెల్ప్‌లైన్ 15100, పిల్లల సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర పోలీసు సహాయం కోసం 112 నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ యం. శాంత, మీడియేటర్ న్యాయవాదులు వేణుగోపాల్, రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ టి. జ్ఞానేశ్వరి, అధ్యాపకులు శ్రీరాముల రెడ్డి, చంద్రమౌళి, రాజా రావు, నాగమహేశ్వర రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కడప “స్మార్ట్ కిచెన్”కు జైకా, నీతీ ఆయోగ్ ప్రశంసలు...!

### కొండపేట జెడ్పిహెచ్ఎస్ లో స్మార్ట్ కిచెన్, చెన్నూరు గర్ల్స్ హైస్కూలు మధ్యాహ్న భోజన అమలు తీరు పరిశీలన.

### విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జైకా ప్రతినిధీ యుమికో ఓనిషి, జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు



కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 8: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పోషకాహారాన్ని అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, పరిశుభ్రత, బాధ్యత, సమైక్యతా భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న కడప జిల్లా స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. మంగళవారం చెన్నూరు మండలంలో జైకా టీమ్ లీడర్ యుమికో ఓనిషి, నీతి ఆయోగ్ ఆరోగ్యం--పోషణ నిపుణుడు



మోహిత్ సూద్ తదితరులు పర్యటించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, జేసీ డా. నిధీమీనా హాజరయ్యారు. తొలుత కొండపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్‌ను సందర్శించి అక్కడ ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, భోజనం పాఠశాలలకు తరలింపు, సమయపాలన, ఉష్ణోగ్రత పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్మార్ట్ కిచెన్ నిర్వహణ విధానాన్ని ఒక్కో విభాగం వారీగా వారికి వివరించారు. అనంతరం చెన్నూరు మండల కేంద్రంలోని పీఎం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జైకా ప్రతినిధులు పరిశీలించారు. స్మార్ట్ కిచెన్ నుంచి సరఫరా చేసిన మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసిన యుమికో ఓనిషి.. ఆహారం నాణ్యత, రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, పరిశుభ్రతను ప్రత్యక్షంగా గమనించారు. అనంతరం యుమికో ఓనిషి, మోహిత్ సూద్‌లతో పాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, పలువురు అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్మార్ట్ కిచెన్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పోషకాహారంపై రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించగా.. వాటిని జిల్లా కలెక్టర్ స్వయంగా జైకా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం భోజనం అందించడమే కాకుండా.. భోజన సమయాన్ని ఒక అభ్యాస ప్రక్రియగా మార్చడమే ఏఎన్‌టీఏస్ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం, క్రమపద్ధతిలో భోజనం చేయడం, అవసరమైనంత మాత్రమే వడ్డించుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, భోజనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా చేస్తున్నట్లు తెలిపారు. జైకా ప్రతినిధి యుమికో ఓనిషి మాట్లాడుతూ.. స్మార్ట్ కిచెన్ వ్యవస్థ విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి ప్రవర్తనలోనూ సానుకూల మార్పులకు దోహదపడుతోందని ప్రశంసించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం, పాఠశాలలో అమలవుతున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా కార్యక్రమం యొక్క ప్రభావాన్ని తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. కడప జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న ఈ విధానం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణ తీరును, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రత్యక్షంగా పరిశీలించిన జైకా బృందం.. జిల్లా యంత్రాంగం చేపట్టిన విధానంపై సంతృప్తి వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పర్యటించి స్వయంగా పరిశీలించడం, విద్యార్థులతో కలిసి భోజనం చేయడం



ద్వారా కార్యక్రమంపై మరింత సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడి, పరిశుభ్రమైన, పోషకాహార మధ్యాహ్న భోజనం అందుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆహార తయారీ నుంచి సరఫరా వరకు నాణ్యత, సమయపాలన వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యవస్థను విద్యార్థుల సమగ్ర వికాసానికి అనుసంధానిస్తూ జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలకు తాజాగా జైకా ప్రతినిధుల ప్రశంసలు మరింత ప్రోత్సాహాన్ని అందించాయి. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళీ, డీఈవో శంశుద్దీన్, సమగ్రశిక్ష ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడి డా. రాజ్యలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

# పారదర్శకంగా.. సజావుగా ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 8: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు అర్హులైన వారి నుంచి సెప్టెంబర్ 7, సోమవారం నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా, సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సహాయ సహకారాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, సంప్రదాయ వృత్తిదారులు తదితర అర్హులైన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛను కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

### నియోజకవర్గాల వారీగా ప్రత్యేక పర్యవేక్షణ

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా నియమించిన నియోజకవర్గ ప్రత్యేక అధికారులు మంగళవారం తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మదనపల్లె మండలంలోని బసినికొండ--1, కొండమర్రిపల్లి స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులు, పింఛను లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీ పి. రమణారెడ్డితో కలిసి సచివాలయం--6 పరిధిలోని బేతల కాలనీలో పర్యటించి దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. పీలేరు ఆర్డీవో కే. విజయలక్ష్మి వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లి స్వర్ణ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను



పరిశీలించారు. పుంగనూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి పుంగనూరు మండలం భీమగానిపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో ఎంపీడీవోతో కలిసి పింఛను దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. మాధవ కృష్ణారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అంగళ్లు, కురబలకోట స్వర్ణ గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు.

### దరఖాస్తుదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలి

తనిఖీల సందర్భంగా అధికారులు పింఛను లబ్ధిదారులు, దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి పథకం ప్రయోజనాలు పొందడంలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. సేవల అందజేత పరిస్థితి, ఫిర్యాదుల పరిష్కార విధానాలను కూడా సమీక్షించారు. సంబంధిత సచివాలయ సిబ్బంది స్వీకరించిన ప్రతి పింఛను దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి, దానిపై తీసుకున్న చర్యలు, సంబంధిత వ్యాఖ్యలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పాటు సంబంధిత రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి పరిశీలన, ఆన్‌లైన్ నమోదు, వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ, తదుపరి ప్రభుత్వ అనుమతి వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం, నిర్దేశిత కాలపరిమితి పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### పింఛను దరఖాస్తుల ప్రక్రియకు నిర్దేశిత టైమ్‌లైన్

కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు -- 7 పని దినాలు: కొత్త పింఛను దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, e-KYC ధ్రువీకరణ.

కామన్ ఎలిజిబిలిటీ వాలిడేషన్: సంబంధిత శాఖలు, SGSW, RTGS, SERP విభాగాల ద్వారా అర్హతల ధ్రువీకరణ.

సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు: భౌతిక ధ్రువీకరణతో పాటు చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు తదితర వృత్తి ఆధారిత పింఛన్లకు సంబంధిత శాఖల ద్వారా ధ్రువీకరణ.

సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు: ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా/రాష్ట్ర స్థాయి అధికారులు దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, అర్హులైన దరఖాస్తుల సిఫారసు.

సెప్టెంబర్ 25 నుంచి 26 వరకు: ఎస్ఈఆర్‌పి ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతి ప్రక్రియ పూర్తి చేయడం.

ఈ నిర్దేశిత కాలపరిమితిలో ప్రతి దశను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు పింఛను ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు అర్హత ఉన్న వారు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుదారులకు అవసరమైన సహాయాన్ని సచివాలయ సిబ్బంది అందించాలని, అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

## సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారం

### బోటిక్ రంగంలో వినూత్న నమూనాలు..

### పేద విద్యార్థులకు ఉచితంగా పాఠశాల యూనిఫారాలు



సత్తెనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 08: సత్తెనపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ బోటిక్ ఆర్టిస్ట్ సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారం లభించింది. బోటిక్ రంగంలో నూతన మోడళ్లను రూపొందిస్తూ, పేద విద్యార్థులకు ఉచితంగా పాఠశాల యూనిఫారాలను కుట్టించి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక భాషా సాంస్కృతిక శాఖ, కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. బోటిక్ రంగంలో తన ప్రతిభను చాటుకోవడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తూ ఉచితంగా పాఠశాల యూనిఫారాలను కుట్టించి ఇవ్వడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సరికొండ భ్రమరాంబను అభినందించారు. పురస్కారం అందుకోవడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తూ ఉచితంగా పాఠశాల యూనిఫారాలను అందజేస్తానని తెలిపారు.

## 10వ తేదీ నాటికి బహిరంగ విచారణ పూర్తి చేయాలి

### ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులపై వేగంగా చర్యలు

### తహసీల్దార్లకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి ఆదేశాలు



గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08: ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల బహిరంగ విచారణను ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. బుక్ ఏ కాల్ విధానంలో వచ్చిన అభ్యర్థనలను వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత యాప్‌ను కనీసం గంటకు ఒకసారి పరిశీలించాలని సూచించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా వచ్చిన క్లెయిమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో రాజకీయ పార్టీలకు అందించాల్సిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని 1,200 మంది ఓటర్ల వివరాలు, ఫొటోలను విధిగా పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల వివరాల్లో తప్పులు ఉన్నా, ఫొటోలు జత కాకపోయినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి విద్యాసంస్థలో ఓటరు అక్షరాస్యత క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. జనగణనకు సంబంధించి విచారణ పూర్తి చేయాల్సిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్ల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయాలని సూచించారు. రీ-సర్వే వంటి ప్రక్రియలపై ఆయా గ్రామాల్లో ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. రీ-సర్వే విధానంపై క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఒక్కరికీ వివరించే స్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలతో విస్తృతంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సేవలను త్వరితగతిన అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి ఆదేశించారు.

## గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం!

### 500 వాట్లకు రూ.1,000.. 1,000 వాట్లకు రూ.2,250

### ఈ నెల 26 వరకు తాత్కాలిక విద్యుత్ సరఫరా




విజయవాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 08: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు. భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందామని పిలుపునిచ్చారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని, మండపాలపై నుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లను మాత్రమే వినియోగించాలని, వైరింగ్ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని తెలిపారు. అనధికారిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, అధిక లోడ్ వల్ల ప్రమాదాలు జరగకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ తెలిపారు. 500 వాట్లకు రూ.1,000, 1,000 వాట్లకు రూ.2,250 చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని, దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు వెల్లడించారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనధికారికంగా విద్యుత్ వినియోగించినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద భక్తులు, ప్రజల రాకపోకలకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో పాటు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి ఆకాంక్షించారు.

## జిల్లా కలెక్టర్ల సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు కలెక్టర్

### అధికారులకు కీలక సూచనలు..

### బాధ్యతల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని ఆదేశం



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 8: ఈ నెల 10, 11 తేదీల్లో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్న జిల్లా కలెక్టర్ల సమావేశ ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు, ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లు, ప్రోటోకాల్, భద్రత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో వయోజనుల్లో 100% అక్షరాస్యతే లక్ష్యం

### 'అక్షర ఆంధ్ర'తో నిరక్షరాస్యులకు విద్యా వెలుగులు

### అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ



పల్నాడు జిల్లా/మహి న్యూస్ । సెప్టెంబర్ 08: పల్నాడు జిల్లాలోని వయోజనుల్లో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వయోజన విద్యాశాఖ గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు వి. అజయ్ కుమార్ తెలిపారు. 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్షరాస్యత దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వి. అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలు, వి.బి.జి. రాంజీ గ్రూపు సభ్యుల్లోని పురుషులు, సమాజంలోని 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్య వయోజనులు ఈ కార్యక్రమంలో చేరి విద్యను అభ్యసించాలని సూచించారు. 2026 సెప్టెంబర్ 8 నుంచి 2027 మార్చి వరకు 'అక్షర ఆంధ్ర' అభ్యసన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి, ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక స్వచ్ఛంద ఉపాధ్యాయుడిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు స్వచ్ఛందంగా వయోజనులకు విద్యాబోధన చేస్తారని తెలిపారు. అభ్యాసకులకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వివరించారు. 'అక్షర ఆంధ్ర' యాప్ ద్వారా వీడియో పాఠాలు, పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అభ్యాసకులు మొత్తం 40 గంటల పాఠ్యపుస్తక అభ్యాసం, 45 గంటల వర్క్‌బుక్ వ్యాయామాలు, 15 గంటల వీడియో పాఠాలను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం మార్చి నెలలో ఎన్ఐఓఎస్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తారని పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, ఏపీడీ, మెప్మా పీడీ, ఎంపీడీఓలు మాట్లాడుతూ 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అక్షరాస్యత అభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు కూడా దోహదపడవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ పరిధిలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థుల సహకారంతో వయోజనుల్లో అక్షరాస్యతను మరింత అభివృద్ధి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, వీఓలు, వయోజన విద్యాశాఖ సిబ్బంది, ఏపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అనంతరం అక్షరాస్యత ఆవశ్యకతపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యుల కోసం అక్షరాస్యత తరగతులను ప్రారంభించారు. పల్నాడు జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## వయోజనుల్లో శత శాతం అక్షరాస్యతే లక్ష్యం

### 'అక్షర ఆంధ్ర'తో నిరక్షరాస్యులకు విద్యా వెలుగులు

### అక్షరాస్యతతో పాటు డిజిటల్, ఆర్థిక, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై అవగాహన అవసరం



గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08: వయోజనుల్లో శత శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె. ఆంజనేయులు అన్నారు. 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా కాకుమాను మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత




దినోత్సవ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె. ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలు, వి.బి.జి. రామ్‌జీ గ్రూపు సభ్యుల్లోని పురుషులు, సమాజంలో 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్య వయోజనులు ఈ కార్యక్రమంలో చేరవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 8 నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు నిర్వహించే 'అక్షర ఆంధ్ర' అభ్యసన తరగతులకు హాజరై చదువుకోవాలని కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించి, ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక స్వచ్ఛంద ఉపాధ్యాయుడిని ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వచ్ఛంద ఉపాధ్యాయులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా వయోజనులకు విద్యాబోధన చేస్తారని వివరించారు. అభ్యాసకులకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. 'అక్షర ఆంధ్ర' యాప్ ద్వారా వీడియో పాఠాలు, పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. మొత్తం 40 గంటల పాఠ్యపుస్తక అభ్యాసం, 45 గంటల వర్క్‌బుక్ వ్యాయామాలు, 15 గంటల వీడియో పాఠాలను అభ్యాసకులు పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. మార్చి నెలలో జాతీయ ఓపెన్ స్కూలింగ్ సంస్థ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లాలో అక్షరాస్యత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మండల తహసిల్దార్ వెంకట స్వామి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థుల సహకారంతో కాకుమాను మండలంలోని వయోజనుల్లో అక్షరాస్యతను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి అక్షరాస్యత ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాకుమాను మండల సమాఖ్య ఏపీఎం సురేష్, వయోజన విద్య గుంటూరు డివిజన్ పర్యవేక్షకులు ఓ. నారాయణరావు, పర్యవేక్షకులు సి.హెచ్.వి. చలపతిరావు, దాసరి వెంకటస్వామి, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో ఘనంగా ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్

### "వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో

### ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన




పల్నాడు జిల్లా, మహి న్యూస్ సెప్టెంబర్ 8: జిల్లా పరిశ్రమల శాఖ, పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌ను నరసరావుపేటలోని కాసు సెంట్రల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతిక శుక్ల ఐఏఎస్ పాల్గొని ముఖ్య సందేశాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను



ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని జిల్లా పరిశ్రమల అధికారి ఎస్. వెంకట సురేష్ తెలిపారు. ఉత్పత్తి, మార్కెటింగ్, రుణ సదుపాయాలు, డిజిటల్ ఆధారిత సేవల వినియోగం తదితర అంశాల మధ్య సమన్వయం సాధించడంతో పాటు, సులభతరంగా వ్యాపారాలను ప్రారంభించేందుకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నూతన పరిశ్రమలను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున పల్నాడు జిల్లా యంత్రాంగం అందిస్తుందని పేర్కొన్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సెమినార్లు, హెల్ప్‌డెస్క్‌లు, స్టాళ్లను ఏర్పాటు చేశారు. పరిశ్రమల స్థాపన, రుణ సదుపాయాలు, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, డిజిటల్ సేవల వినియోగంపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చిన్నరాజు, ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ మనోహర్, పరిశ్రమల శాఖ అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో రుణాల పంపిణీ వేగవంతం చేయాలి

### కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా రైతులకు అవగాహన కల్పించి

### బ్యాంకులు రుణాలు అందించాలి: కలెక్టర్ కృతిక శుక్లా




పల్నాడు జిల్లా, మహి న్యూస్ సెప్టెంబర్ 8: పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జూన్ త్రైమాసికానికి




సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశం కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జూన్ 30, 2026 నాటికి ప్రాధాన్యత, ఇతర రంగాలకు బ్యాంకులు అందించిన రుణాల పంపిణీపై సమావేశంలో సమీక్షించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి వార్షికంగా రూ.17,761 కోట్ల రుణ లక్ష్యానికి గాను జూన్ త్రైమాసికం నాటికి రూ.5,927.84 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగంలో రూ.3,112 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను రూ.1,445 కోట్ల రుణాలను అందించారు. ప్రాధాన్యత రంగానికి సంబంధించి రూ.21,490 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను జూన్ త్రైమాసికం నాటికి రూ.7,445 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. మొత్తం వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) రూ.25,879 కోట్ల లక్ష్యానికి గాను రూ.9,086 కోట్ల రుణాలను అందించినట్లు అధికారులు వివరించారు. కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా రైతులకు సత్వరమే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)పై జిల్లాలోని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రతి బ్యాంకు శాఖలో పోస్టర్లు ఏర్పాటు చేయాలని బ్యాంకర్లను కోరారు. వివిధ సబ్సిడీ పథకాల ద్వారా మరింత మంది లబ్ధిదారులకు రుణాలు అందేలా ప్రతి నెల కనీసం రెండు రుణ మేళాలు నిర్వహించాలని సూచించారు. పల్నాడు జిల్లాలో నిర్వహించిన క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బ్యాంకర్లను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించినట్లు కలెక్టర్ కృతిక శుక్లా ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం కే.ఎస్. రామ్ ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్, డీసీసీ/డీఎల్ఆర్‌సీ కన్వీనర్ డి. లక్ష్మీనారాయణ, నాబార్డ్ డీడీఎం శరత్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రామకృష్ణ, వివిధ బ్యాంకుల అధికారులు, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com